



ఉష్ణోగ్రత (అంచనా)

13-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	42	28
తెనాలి	42	28
నరసరావుపేట	41	27
బాపట్ల	39	29
రెంటచింతల	42	28
చీరాల	39	29

రాయితీ పథకం..
లక్ష్యానికి దూరం

- సబ్సిడీ యంత్రాలపై అన్నదాతల అనాసక్తి!
- ధరల్లో భారీగా తేడా ఉండడమే కారణమా?
- ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాని వైనం



రాయితీపై సేద్య పరికరాలను అందించే విధానాన్ని గత ప్రభుత్వం పూర్తిగా తెరమరుగు చేసి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టింది. ఈ ప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించింది. రాయితీ పొందడానికి మార్గదర్శకాలు విడుదల చేయడమే కాకుండా మూడు జిల్లాలకు నిధుల కేటాయింపు, పరికరాల లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. మామూలుగా అయితే రాయితీ పరికరాల కోసం రైతాంగం నుంచి పెద్ద ఎత్తున దర ఖాస్తులు రావాల్సి ఉంది. కానీ అనూ హ్యంగా స్పందన అంతంతమాత్రంగా ఉండడమే కాకుండా నిర్ధేశించు కున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే వ్యవసాయశాఖ ఆపసోపాలు పడాల్సి వచ్చింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 10,000 నుంచి 50,000 వరకు ఉంది. అది పోను మిగిలిన మొత్తాన్ని అన్నదాతలు చెల్లించి పరికరాలను పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కానీ ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీల మాయాజాలం నడిచినట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కూడా కలుపుకుంటే బయటిమార్కెట్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు రైతులు గుర్తించారు. నిజానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. కానీ బ్రాండెడ్ లేదా గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం రాయితీ యంత్ర పరికరాలపై ఆది నుంచి విముఖత ప్రదర్శిస్తూనే ఉన్నారు. మండలాల వారీగా అధికారులకు నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చి వాటిని పూర్తి చేయాలని మెడమీద కత్తిపెట్టి వ్యవసాయశాఖ పనిచేయించింది. మార్చి చివరికే తుది గడువుగా తొలుత ప్రకటించిన ప్రభుత్వం స్పందన నిరాశజనకంగా ఉండడంతో గడువును పెంచుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంతో దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేసినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. మూడుసార్లు గడువు పొడిగించినా, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినా పరికరాల లక్ష్యం చేరుకోవడంలో మాత్రం వ్యవసాయశాఖ వెనకబడే ఉంది. రాయితీ కోసం ఎగబడాల్సిన రైతాంగం దానిని కాదనుకునే విధంగా వ్యవహరించడం వెనక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పనే వ్యవసాయశాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించడంపై వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. పైగా అన్నదాతల దగ్గర డబ్బులు లేకపోవడం కూడా లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణంగా ఉందనే వాదనను యంత్రాంగం చేయడం విస్తుగొలిపే విధంగా ఉంది

జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా..

ఐదేళ్ల పాటు అమలుకు నోచుకోని రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విధివిధానాలను మూడు నెలల క్రితమే జారీ చేయడంతో పాటు జిల్లాల వారీగా లక్ష్యాలనూ నిర్దేశించింది. బాపట్ల జిల్లాకు సంబంధించి కేటాయించిన నిధులు రూ.2.70 కోట్లు కాగా అందించాల్సిన యూనిట్లను 1,400గా తెలిపింది. అదే విధంగా గుంటూరు జిల్లాకు వచ్చేసరికి నిధులు రూ.2.60 కోట్లుకాగా యూనిట్ల సంఖ్య 1,410గా ఉంది. పల్నాడు జిల్లాలో నిధులు రూ.2.75 కోట్లు కాగా యూనిట్ల సంఖ్యను 1,470గా వ్యవసాయశాఖ ప్రకటించింది. అవసరాన్ని బట్టి నిధుల పెంపుపై కూడా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది.

వందశాతం చేరుకోవడంలో విఫలం..

జిల్లాల వారీగా కేటాయించిన నిధులే అంతంతమాత్రంగా ఉంటే గడువు పూర్తయ్యేసరికి ఎక్కడా కూడా వందశాతం లక్ష్యాలను చేరుకున్న దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాకు మంజూరు చేసిన 1,400 యూనిట్లకు 1100కు మాత్రమే అనుమతులు మంజూరు అయ్యాయి. రూ.2.10 కోట్ల నిధులనే యంత్రాంగం ఖర్చు చేయగా ఇంకా రూ.60 లక్షల నిధులు అలానే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోకూడా కేటాయించిన నిధులు, యూనిట్లు మంజూరులో కూడా 75 శాతమే చేరుకున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఐదేళ్ల పాటు మూలన పడేసిన ఓ పథకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తే వేలల్లో దరఖా స్తులు రావాల్సి ఉండగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడమే గగనమై పోయింది.

లోపం ఎక్కడ జరిగింది...

రోటోవేటర్ ధరలు కనిష్టంగా రూ.80,000 దగ్గర నుంచి రూ.1,50,000 వరకు ప్రభుత్వం మార్గదర్శకాలలో పేర్కొంది. ఇందుకు సంబంధించి రైతుకు అందే రాయితీ రూ.50,000 వరకు ఉంది. సబ్సిడీపోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయటి మార్కెట్ కన్నా కూడా రూ.30,000 వరకు అధికంగా ఉన్నట్లు తెలు స్తోంది. దీంతో అన్నదాతకు సబ్సిడీ వచ్చినా కానీ చెల్లిం చే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉండడమే ఈ స్థితికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.





చిన్నారులపై.. వాత్సల్యం!

అనాథ పిల్లలను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. 'మిషన్ వాత్స ల్య' పేరుతో అనాథ పిల్లలకు నెలనెలా ఆర్థిక సహాయం అందించడం తోపాటు, వారి సంరక్షణకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా తాజాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిం ది. దీంతో అనాథ పిల్ల లకు గొప్ప భరోసా లభించినట్లయింది.

- 'మిషన్ వాత్సల్య' పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- అనాథ, నిరుపేద పిల్లలకు నెలకు రూ. 4వేల ఆర్థిక సహాయం
- తన వాటాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత అంగన్వాడీలదే!

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): 'మిషన్ వాత్సల్య' అనేది కేంద్ర ప్రాయోజిత పథకం. ఈ పథకాన్ని 2021 లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని అనాథలైన చిన్నారులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ వాత్సల్య'కు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం తనవంతు వాటాగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ. 19.12 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో పథకం అమలు లాంఛనప్రాయమయింది.

నెలకు రూ. 4వేలు ఆర్థిక సహాయం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనాథ చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తారు. ఆదరణ లేని అభా గ్యులు, అనాథ బాలలకు విద్య, వైద్య అవసరాలు తీర్చ డం కోసమే ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుంది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా నిధుల కోసం కేంద్రానికి ప్రభుత్వం సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

● అర్హులు ఎవరంటే..

బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం సంరక్షణ ఆదరణ అవసరమైనవారు ఈ పథకానికి అర్హులవుతారు. వితంతువులు, లేదా విడాకులు తీసుకున్న తల్లి సంరక్షణలో ఉండే పిల్లలు, తల్లిదండ్రులు ఇద్దరి నీ కోల్పోయి ఇతరుల వద్ద ఆశ్రయం పొందుతున్న అనాథలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లి దండ్రుల బిడ్డలు, పోషించే స్తోమతలేని తల్లిదండ్రుల పిల్లలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, అక్రమ రవాణాకు గురైనవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన, యాచక చిన్నారులు, వీధుల్లో నివసిస్తున్న, హింసకు, దోపిడీకి గురైన చిన్నారులు, అనాథాశ్రమాల్లో ఉంటూ మద్దతు పునరావాసం అవసరమైన పిల్లలు ఈ పథకానికి అర్హులుగా ఉంటారు.

● అర్హతలు ఇలా..

మిషన్ వాత్సల్య పథకం కోసం దరఖాస్తు చేసేవారి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.98 వేలకు మించి ఉండకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం వర్తించేవారికి ఈ పథకం వర్తించదు.

● పరిశీలన ఇలా..

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. రాష్ట్రంలో 'తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా, విడాకులు తీసుకున్న, కుటుంబాన్ని వదిలేసిన తల్లిదండ్రుల పిల్లలు, ప్రాణాంతక వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలకు, అక్రమ రవాణా, దాడులకు గురైన పిల్లలు అర్హులు'గా గుర్తిస్తారు. 18 ఏళ్ల వరకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఈ పథకం కింద ఆరు నెలలకు ఒకసారి, మూడు నెలలకు ఒకసారి నిధుల్ని విడుదల చేస్తారు.

● అంగన్వాడీలపై బాధ్యత

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ పరిధిలో కార్యకర్తలు మిషన్ వాత్సల్య పథకం గురించి ప్రచారం చేయాల్సి ఉంటుంది. అర్హులైన చిన్నారులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉంటుంది. క్రమం తప్పకుండా యాప్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తించిన అనాథ పిల్లలు, అర్హులైన చిన్నారుల సంరక్షకులతో మాట్లాడి దరఖాస్తు చేసుకునేలా అంగన్వాడీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలి.

అవిశ్వాసం కాక..!

- మూడో వంతు కౌన్సెలర్ల మద్దతు కోసం జంజనం ఆపసోపాలు
- మద్దతు కోసం మంగళగిరి చుట్టూ ప్రదక్షిణలు
- రేపు వీడనున్న ఉత్కంఠ

చీరాల, మే 12 (ఆంధ్రజ్యోతి): చీరాల మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం అంశం ఉత్కంఠ రేపుతోంది. మరో రెండురోజుల్లో జంజనం నెగ్గుకొని వస్తారా..? లేదా...? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొంతకాలంగా ఈ వ్యవహారం తారస్థాయిలో చర్చనీయాంశంగా సాగుతుంది. నిన్నమొన్నటి వరకు వైసీపీలో ఉన్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తద్వారా తన పదవికి భరోసా ఉంటుందని భావించారు. అయితే చైర్మన్‌గా ఆయన్ను కొనసాగించేందుకు టీడీపీ కౌన్సిలర్లు ససేమేరా అంటున్నారు. దీంతో ఎమ్మెల్యే సైతం తాను టీడీపీ కౌన్సిలర్లకే మద్దతు ఉంటానని వారి నిర్ణయమే తన నిర్ణయం అని జంజనంకు రిక్తహస్తం చూపారు. దీంతో ఆయన తన వర్గాన్ని నిలుపుకొనే ప్రయత్నం చేస్తూనే, టీడీపీ కౌన్సిలర్ల మద్దతు కోసం మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు మంగళగిరి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అయినప్పటికీ, ఆయన మంత్రి అపాయింట్‌మెంట్ లభించలేదని తెలిసింది. ఒకవేళ తనకు లోకేశ్ నుంచి సానుకూల స్పందన లేకపోతే జజనం తన వర్గాన్ని గైర్హాజరు చేయించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే కొండయ్య అవిశ్వాసం ప్రవేశపట్టిన కౌన్సిలర్‌లతో ఆదివారం రాత్రి విందుకు హాజరయ్యారు. ముఖ్యమైన అంశాలు చర్చించుకున్నట్లు భోగట్టా. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సైతం శనివారం రాత్రే తన మద్దతు కౌన్సిలర్లు, కేడర్‌తో సమావేశం నిర్వహించారు. వీరు అభివృద్ధే ముఖ్యమంటూ సమయానుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఓ కౌన్సెలర్ మిగిలిన కౌన్సిలర్లను మెప్పించే పనిలో ఉన్నారు. ఈ విధంగా చూసుకుంటే 33మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే ఎంపీ ఓట్లు కలుపుకొని మొత్తంగా 35 ఓట్లు పురపాలకంలో ఉన్నాయి. అయితే ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జంజనంకు 1/3 అంటే 13 ఓట్లు మాత్రమే అవసరం ఉండగా, నూతనంగా అధికారం నెగ్గాలంటే వారికి 2/3 అంటే కనీసం 23ఓట్లు ఉండాల్సి ఉంది. ఈక్రమంలో ప్రస్తుతం ఎవరి వ్యూహంలో వారు బిజీబిజీగా ఉన్నారు. ఈక్రమంలో ఎత్తులు పైఎత్తు, పొత్తులు, ప్రతివ్యూహాలు వ్యవహారం 14న జరిగే అవిశ్వాసంతో ఒక స్పష్టత రానుంది.

పులకరించిన భావపురి

- వైభవంగా భావదేవుని రథోత్సవం
- భావదేవ పాహిమాం..అంటూ మారుమోగిన పట్టణం
- రథోత్సవం ప్రారంభించిన దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర నేతలు
- రథం లాగేందుకు పోటీపడ్డ భక్తులు

బాపట్ల,మే12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1,432వ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగు తున్నాయి. సోమవారం బావయ్య వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించి, రథం బజారు నుండి సూర్యలంక రోడ్డులోని శ్రీ ప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని ఉత్సవంగా తీసుకెళ్లి తిరిగి ఆలయానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి రథాన్ని లాగేందుకు ఆసక్తి చూపారు. భావదేవుని నామస్మరణతో భావపురి పులకరించింది. అనేక ప్రాంతాల్లో ఉంటున్న బాపట్ల వాసులు ఉత్సవాలకు ప్రత్యేకంగా విచ్చేసి, స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భావదేవ పాహిమాం.. రాజ్యలక్ష్మీ రక్షమాం, శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి బహుపరాక్, గోవిందా.. గోవిందా అంటూ భక్తుల నినాదాలతో రథంబజారు, సూర్యలంక రోడ్డు మారుమోగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచి, పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పూజల్లో దేవదాయ మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఈ ఏడాది నూతనంగా నిర్మించిన రథంపై బావదేవుని ఉత్సవం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్రదేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తదితరులు రథం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవంలో కొనసాగారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.

పటిష్ట బందోబస్తు

బాపట్ల తిరునాళ్ల సందర్భంగా భావదేవుని రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దేవాలయం నుండి సూర్యలంక రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు వాహనాలు అడ్డురాకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. కాలినడకన వేడుకల్లో పాల్గొనే ఏర్పాట్లు చేశారు. రథం లాగే సమయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేశారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటమురళి ఎమ్మెల్యే కొండయ్యకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వేగేశన


డోలు వాయిద్యాలతో నృత్యం చేస్తున్న కళాకారులు


నూతన రథంపై కొలువు తీరిన భావదేవుడికి పూజలు


● రథోత్సవానికి హాజరైన భక్తులు

నీటి కుంటలో పడి బాలుడు మృతి

మార్టూరు,మే12(ఆంధ్రజ్యోతి): నీటికుంటలో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో కొండవ వద్ద ఉన్న నీటికుంటలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాలుడు దుడ్డు కార్తీక్(8) తాతయ్య ప్రభుదాసుతో కలిసి గేదెలను మేపుకోవడానికి కొండ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ నీటి కుంటలో గేదెలు దిగాయి. వాటిని తోలడానికి నీటికుంటలో దిగిన బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించని తాతయ్య ప్రభుదాసు కార్తీక్ ఇంటికి వెళ్లాడని బావించాడు. కొంతసేపటి తర్వాత గేదెలను తోలుకొని ఇంటికి వచ్చారు. తర్వాత కార్తీక్ ఇంటికి రాలేదని గ్రహించిన ప్రభుదాసుతో పాటు కుటుంబ సభ్యులు, కొండ వద్దకు వెళ్లి నీటికుంట చూడగా, చనిపోయిన కార్తీక్ మృతదేహం కనిపించింది. కార్తీక్ తల్లితండ్రులు తిమోతి, సుస్మిత దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతి చెందిన కార్తీక్ పెద్దవాడు. రెండవ తరగతి పూర్తికావడంతో ఈ ఏడాది 3వ తరగతి చదవాలి. కుమారుడు మృతితో కార్తీక్ తల్లిదండ్రులు, బంధువులు కుప్పకూలిపోయారు. సోమవారం ఉదయం కార్తీక్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.


కార్తీక్ (పాత చిత్రం)

ఏషియన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ యూనివర్సిటీ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబర్చి పలు పతకాలను సొంతం చేసుకున్నారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం తెలియజేశారు. 47 కిలోల విభాగంలో మదిర షానూన్, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా, 84 కిలోలు పైబడిన విభాగంలో నాగం జ్ఞానదివ్యలు స్క్వాట్, బెంచిప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలతోపాటు ఓవరాల్‌గా బంగారు పతకాలను సొంతం చేసుకున్నారని వెల్లడించారు. ఏషియన్ యూనివర్సిటీ కప్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్ యూనివర్సిటీ జట్టు చాంపియన్‌షిప్, క్లాసిక్‌లో ద్వితీయ స్థానం, ఎక్విప్డ్‌లో తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను కేఎల్‌యూ యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ కాకర్ల హరికిషోర్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ ఆర్‌ఎన్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లతో సంధాని, కోటేశ్వరరావు

ఏపీ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు రేపటితో ఆఖరు

◆ అపరాధ రుసుంతో జూన్ 3 వరకు అవకాశం

పెదకాకాని, మే 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్‌సెట్ -2025 దరఖాస్తుకు ఈ నెల 14న బుధవారంతో గడువు ముగుస్తుందని ఏపీ ఎడ్‌సెట్ రాష్ట్ర కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 19, రూ.2వేలతో 24వ తేదీ వరకు, రూ.4వేలతో 26వ తేదీ వరకు, రూ.10 వేల అపరాధ రుసుంతో మే 27 నుండి జూన్ 3 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మే 30 నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 5న మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

16 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

చిలకలూరిపేట, మే12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారన్నారు. హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యువభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుందన్నారు. 17న హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇది రహదారి కాదు, కరీంనగర్ కళాభారతి వారి చీకటిపువ్వు, విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ వారి దొందు దొందే, 18న గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిరుగు మేఘం, చిలకలూరిపేట అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి ఆలితో సరదాగా, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు.




ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి


నృసింహుని జయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఈవో రామకోటిరెడ్డి, అర్చకులు

ముగిసిన నృసింహుడి జయంతి ఉత్సవాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి జరుగుతున్న నృసింహుని జయంతి (ఆవిర్భావ) ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం నర సింహ మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం, సాయం త్రం రాజాధిరాజ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి స్వర్గీయ మాల్యవంతం లక్ష్మీనరసింహాచార్యులు, శేషమ్మ కుటుం బసభ్యులు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆల య ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే కూటమి లక్ష్యం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తమ సమస్యలు తెలుపుతున్న వృద్ధులు

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజలు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర జనార్దనస్వామి ఆలయ సమీపంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కర వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రతి నెలా 9,600 మందికి రూ.40 కోట్లు పెన్షన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌కు సుమారు 500పైగా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రతి దరఖాస్తును వారంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎక్కువగా రేషన్ కార్డులు కోసం అర్జీలు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.46 కోట్ల మందికి నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని అస్థిరపరిచే విధానాలకు స్వస్తిచెప్పాలి

● యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని అస్థిరప రిచే విధానాలకు స్వస్తి చెప్పాలని, లేకుంటే తీవ్ర ఆందోళన చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి స్పష్టం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని, పాఠశాలల పునర్విభజన సక్రమంగా చేపట్టాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కుసుమకుమారి పాల్గొని, మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు రకరకాల పేర్లతో హడావుడిగా తీసుకు వచ్చిన +2 విధానం, 3, 4, 5 తరగతుల తరలింపు వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీ పాఠశాలలపై అనుసరిస్తున్న వైఖరి, ఉన్నత పాఠశాలల పట్ల అనుసరిస్తున్న విధానాలు గందరగోళానికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బాట పట్టిస్తున్నారని తెలిపారు. యుటీఎఫ్ ప్రచుర ణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ జీవో నంబరు 117 వల్ల ప్రభుత్వం విద్యా రంగానికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు పిల్లల నిష్పత్తి తగ్గించాలని డిమాండ్ చేశారు. బదిలీల ప్రమోషన్ల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 15న పాఠశాల కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్, డీఈఓ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎండి దౌలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్ విధుల పర్యవేక్షణకు.. జేసీకి ఉత్తర్వులు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వచ్చే నెల ఆరో తేదీ వరకు మిడ్ టర్మ్ కెరీర్ ట్రైనింగ్‌కు ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమికి వెళ్లడంతో ఆమె విధులను పర్యవేక్షించాలని ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో కలెక్టర్ సెలవుపై వెళితే ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యేవి. ఎక్కువ రోజులు సెలవు పెడితే పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇస్తూ జీవో విడుదల చేసేది. ఇటీవల కలెక్టర్ నాగలక్ష్మి విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇన్‌చార్జిగా జేసీని నియమించింది. ఇప్పుడు ఇన్‌చార్జి/ఎఫ్ఏసీ కాకుండా కలెక్టర్ విధులను పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేయడం రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది. ఇంచుమించుగా నెల పాటు శిక్షణ నిమిత్తం కలెక్టర్ వెళ్లారంటే ఖచ్చితంగా ఎఫ్ఏసీ ఉండాల్సిందే. లేకుంటే పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఏమి ఆలోచన చేసిందో ఏమో 'లుక్ ఆఫ్టర్ కలెక్టర్ డ్యూటీస్' అని మాత్రమే ఇచ్చినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నది.

కొన్ని నెలల నుంచి గుంటూరు జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం పలువురు ఐఏఎస్ అధికారులు ప్రభుత్వస్థాయిలో ప్రయత్నాలు చేసుకొంటున్నట్లు సమాచారం. గతంలో పల్నాడు కలెక్టర్‌గా విధులు నిర్వహించి, కోర్టు ఆదేశాలతో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లి మళ్లీ క్యాట్ ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్ సర్వీసుకు వచ్చిన లోతేటి శివశంకర్ గుంటూరు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు చర్చించుకొంటున్నాయి. 2014-19 మధ్యన గుంటూరు జేసీగా, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌గా విధులు నిర్వహించిన చెరుకూరి శ్రీధర్ పేరు కూడా గుంటూరు కలెక్టర్ పోస్టింగ్ కోసం వినిపిస్తోంది. గతంలో జేసీగా విధులు నిర్వహించి ఇప్పుడు మానవ వనరుల శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న కృతిక శుక్లా పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. కలెక్టర్ నాగలక్ష్మిని బదిలీ చేస్తారానన్న చర్చ కూడా కొనసాగుతోంది.

సీఆర్డీఏ అధికారుల తీరుపై ఆగ్రహం

తుళ్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): 'చిరు వ్యాపారుల పైనా మీ ప్రతాపం..' అంటూ టీడీపీ నాయకులు, రైతులు సీఆర్డీఏ అధికారులపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన మూడు కుటుంబాలు బడ్డీ కొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాయి. ఆలయం స్థలంలో చిరు వ్యాపారులను ఖాళీ చేయించాలని అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారు ఆర్‌అండబీ స్థలంలోనే ఉన్నారని ఇబ్బంది పెట్టొద్దంటూ టీడీపీ నాయకులు అధికారులకు సూచించారు. కానీ, అధికారులు ససేమిర అనడంతో.. తుళ్లూరు సీఆర్డీఏ ఆఫీసుకు రైతులు, టీడీపీ నాయకులు వెళ్లారు. తహసీల్దార్ రవిబాబుని కలసి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర నాయకుడు దామినేని శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, రైతులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపురం రెండో లైనుకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ పులి రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రమేష్ ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టాభిపురం ఎస్సై సుబ్బారావు, సిబ్బంది సోమవారం ఇంటిలో రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రమేష్ పై ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో 50కు పైగా దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉండగా, నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఉందని చెప్పారు.

ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పుపశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి విజయరామరాజుకు సోమవారం సచివాలయంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డీఐలు ఎంతో దోహదపడతారని, పోస్టులు ఖాళీగా ఉన్నందున దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయారని తెలిపారు. ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మన్నెయ్యకు 14 రోజుల రిమాండ్

● టీడీపీ కార్యాలయం దహనం కేసులో నిందితుడు

మాచర్లటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ ఊరిబండి మన్నెయ్యను మాచర్ల పోలీసులు సోమవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. 2022 డిసెంబరు 16న పట్టణంలోని టీడీపీ కార్యాలయం దహనం కేసులో మన్నెయ్య ఏ-27 నిందితుడు. న్యాయాధికారి పి.ప్రశాంత్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. ఇప్పటికే పలు కేసుల్లో మన్నెయ్య రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రిమాండ్ అనంతరం మాచర్ల పట్టణ ఎస్ఐ తురకా వెంకటరమణ మన్నెయ్యను రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించారు.

త్రికోటేశ్వరస్వామి గిరిప్రదక్షిణలో వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరుని గిరి ప్రదక్షిణలో సోమవారం అపశృతి చోటుచేసుకుంది. గిరి ప్రదక్షిణ చేస్తూ చిలకలూరిపేట మండలం పురుషో త్తపట్నంకు చెందిన ఆసా ప్రసాదు(50) మార్గమధ్యలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచర భక్తులు కాపాడటానికి ప్రయత్నించారు. 108 అంబులెన్స్ వచ్చేసరికే అతను మృతి చెందాడు. గుండెపోటు రావడంతో మృతిచెంది ఉంటాడని తోటి భక్తులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారని బంధువులు తెలిపారు. మద్దిరాల్లోని ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పౌర్ణమికి కోటప్పకొండ గిరిప్రదక్షిణకు వేలాదిమంది భక్తులు వస్తుంటారని, మార్గంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరు తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రహదారిపై ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో రాళ్ల తేలి చెప్పులు లేకుండా నడిచే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటి సంతాపం

ప్రసాదు మృతదేహాన్ని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పురుషోత్తపట్నంలో సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. జనసేన నాయకుడు తోటరాజా రమేష్, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, గట్టినేని రమేష్, తోట బ్రహ్మస్వాములు ఆయన వెంట ఉన్నారు.

వైసీపీ నాయకుడి బెదిరింపులపై ఎస్పీకి ఫిర్యాదు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే,12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు నుంచి ఎదురైన బెదిరింపులపై సోమవారం జిల్లా ఎస్పీకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఆశీలు వేలం పాట 2024-25కు చేబ్రోలుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడు వేపూరి బసవపున్నయ్య రు.9 లక్షలకు దక్కించుకున్నాడు. అయితే అతను పంచాయతీకి నగదు జమ చేయకుండానే ఆశీలు వసూలుకు పాల్పడ్డాడు. పంచాయతీకి వేలంపాట నగదు చెల్లించాలని కార్యదర్శి శ్రీనివాసరావు పలుమార్లు బసవపున్నయ్యను కోరగా డబ్బులు చెల్లించనని, అవసరమైతే బదిలీ చేయిస్తానని హెచ్చరించారని ఫిర్యాదు పేర్కొన్నారు. మరోసారి నగదు చెల్లించాలని కోరితే అంతు చూస్తానని బెదిరించినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

బాపట్ల వార్తలు

భావదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

● రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రథోత్సవం గురించి మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు

బాపట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీభావన్నారాయణస్వామి ఆశీస్సులతో దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. బాపట్లలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన రథోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా రూ.కోటి 60 లక్షలు వెచ్చించి నిర్మించిన నూతన రథాన్ని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య తదితర నాయకులతో కలిసి లాంచనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాపట్లలో కొలువైన భావదేవుని బ్రహ్మోత్సవాలలో పాల్గొనటం ఆనందంగా, అదృష్టంగా ఉందన్నారు. స్వామి వారికి ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. భావదేవుని ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌ల సహకారంతో పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రథోత్సవంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత దేశ పరిస్థితుల దృష్ట్యా భావదేవుని ఆశీస్సులు నిండుగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తారన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ ప్రజలంతా శాంతి సౌభాగ్యంతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, ఆలయ ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, ఎం.ఎస్.శేషుకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.



బుద్ధ జయంతి వేడుకల్లో పాల్గొన్న బౌద్ధ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవాళికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన జీవన విధానం పంచశీలను అనుసరించడం ద్వారానే సాధ్యమని గౌతమ బుద్ధుడు ప్రబోధించినట్లుగా బౌద్ధ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం 2569వ బుద్ధ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రం భట్టిప్రోలులో బౌద్ధ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటం వద్ద బౌద్ధ నామస్మరణ చేశారు. బౌద్ధస్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గౌతమబుద్ధుడు, నవబుద్ధుడు అంబేద్కర్‌లకు నివాళులర్పించారు. ఆది ఆంధ్ర నవబుద్ధి సొసైటీ కార్యదర్శి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన వక్తగా విచ్చేసిన బోధి కంచర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, భారత దేశంలో భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం అతి పురాతనమైనదన్నారు. ఇంత విశిష్టత కలిగిన స్థూపాన్ని వినాశనకారులు అసభ్యకరమైన పదాలతో సంబోధించి ప్రజల్లో ఏహ్యాభావం కల్పించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా కిరణ్మయి, ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు బసవ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన, మత్స్యకారులకు న్యాయం చేయటానికి చర్యలు

● ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎమ్మెల్యే వేగేశన



కలెక్టర్‌తో కలిసి అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మత్స్యకారులకు న్యాయం చేయటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రేపల్లెలోని బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ మత్స్యకారులు తమ సమస్యను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పాల్గొని అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు చెందిన మత్స్యకారకుటుంబాలను వెట్టిచాకిరి నుండి విముక్తి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. రేపల్లె ఆర్డీవో, డీఎస్పీలు క్షేత్రస్థాయిలో దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. యానాది మత్స్యకారులకు చేపలవేట నిషేద సమయంలో ఇవ్వాల్సిన భృతి ఇవ్వటం లేదని, జాబితాలో తమపేర్లు లేవని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై మత్స్యశాఖాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రైతులకు పురుగుమందులు పంపిణీ చేయటానికి అవసరమైన ఆన్‌లైన్ ఈపాస్‌మిషన్‌లను ఎరువులు, పురుగుమందుల డీలర్‌లకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం గవర్నర్ చేతులమీదగా ఉత్తమకలెక్టర్ అవార్డు తీసుకున్న జె.వెంకటమురళిని అధికారులు సన్మానించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా సేకరించిన 24 వేల రూపాయల విరాళాలను రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జె.రాజాదెబోరా, ఐసిడిఎస్ పీడీ రాధా మాధవి, జిల్లా రవాణా శాఖాధికారి పరందామరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, సహకారశాఖాధికారి శ్యామ్‌సన్, డీపీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన వేమూరి దుర్గాప్రసాద్‌కి 1.29 సెంట్ల వ్యవసాయ భూమి కలదని, భూమికి పీఎం కిసాన్ కింద లబ్ధి చేకూరటం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. రుద్రవరం గ్రామానికి చెందిన ప్రజలు కూచిపూడి గ్రామం నుంచి రుద్రవరం గ్రామంలోకి వచ్చే పంట కాలువను పునరుద్ధరించాల్సిందిగా కోరారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన సింగోతు రాఘవయ్య తన ఇంటి కరెంటు సర్వీస్, రహదారి సమస్యను పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నారన్నారు. నగరం మండలం సిరిపూడి గ్రామానికి చెందిన యేమినేని శ్రీనివాసరావు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను మంజూరు చేయాలని కోరారు.

పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి దయాబాబు మృతి



దయాబాబు (ఫైల్)

బాపట్ల,మే12 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు మృతి చెందారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన సాయంత్రం వరకు ఉండి ఇంటికెళ్ళేందుకు బయటకొచ్చి కార్యాలయం ఆరుబయట కిందపడిపోయాడు. ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్ళగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం దయాబాబు అని పేరుపెట్టి పిలిచే విధంగా పార్టీ కోసం నిబద్ధతతో, అంకితభావంతో పని చేసేవాడు. ఆయన మృతికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, మందపాటి ఆంద్రేయ, కూచిపూడి శ్యామ్ సుందర్ తదితరులు సంతాపం ప్రకటించారు.





శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవం, పాల్గొన్న భక్తులు

కమనీయం.. భావదేవుని కల్యాణం



స్వామివారికి గరుడోత్సవం

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : భావపురి ఇలవేల్పు, ప్రసిద్ధి గాంచిన శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1,432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం తెల్లవారుజామున కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారి పుట్టింటి వారైన కొండపాటూరి గ్రామ వాస్తవ్యులు పుట్టింటి మర్యాదగా తలంబ్రాలు, మెట్టెలు, మంగళ సూత్రాలు అమ్మవారికి సమర్పించి కన్యాదానం చేశారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు గ్రామస్తులు ఉభయదాతలుగా కూర్చొని కన్యాదానం చేయడం జరిగింది. కల్యాణం అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఉభయదేవతలతో నగరోత్సవం వేదపండితులు అంగరంగ వైభవంగా మేళతాళాలతో నిర్వహించారు. శ్రీలలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు నల్లూరి పాంచజన్యం, మోహనరంగాచార్యులు, శ్రీనివాసుల విఖనసమూర్తి, వినుకొండ సత్యంబాబు, ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు, ఈఓ డి.వెంకటేశ్వర్లు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

13 వేల మందికి అన్నసంతర్పణ

శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం అన్న సంతర్పణ చేశారు. 17 ఏళ్లగా భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి కల్యాణం రోజు అన్నసంతర్పణ చేస్తున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, కొటికం సుబ్బారావు గురుస్వామి, బి.బాబునాగేంద్ర, నెమలికంటి హనుమంతరావు తదితరులు పాల్గొని, భక్తులకు వడ్డించారు. 13వేల మందికిపైగా అన్నసంతర్పణ చేశారు.



అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్

వైభవంగా తిరునాళ్ల మహోత్సవం

● తరలివచ్చిన భక్తజనంతో కోలాహలం



భక్తి పాటలకు నృత్యం చేస్తున్న యువతులు

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన దివ్యరథోత్సవంలో భాగంగా తిరునాళ్ళ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భావదేవుని ఆలయం దగ్గర నుంచి రథం బజారు, సూర్యలంకరోడ్డు, జీబీసీ రోడ్లు విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాళ్ళ వేడుకలలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల బృందాలు భక్తిపాటలకు నృత్యం చేస్తూ, దేవతామూర్తుల వేషధారణలో భక్తులకు ఆశీస్సులు అందించారు. రకరకాల ఆట వస్తువులు, తినుబండారాల విక్రయశాలలు ఏర్పాటు చేశారు. యువత వాటిని కొంటూ సందడి చేశారు. దీంతో రథం బజారు, సూర్యలంక రోడ్డు, జీబీసీ రోడ్డులో భక్తులు పెద్దఎత్తున నిలిచిపోయారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రించి భక్తులకు ఇబ్బంది లేకుండా చేశారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కూటమిశ్రేణులతో కలిసి ఉత్సవంలో ముందుభాగాన ఉండి విజయవంతం చేశారు. అధికారులు, నాయకులు, భక్తులు విచ్చేయటంతో తిరునాళ్ళ సందడి పెద్ద ఎత్తున జరిగింది.

భావదేవుని ఆశీస్సులతో బాపట్ల అభివృద్ధి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : భావదేవుని ఆశీస్సులతో బాపట్లను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన దివ్యరథోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.చేతులెత్తి నమస్కరించి భావదేవ నీవే మాకు రక్ష మీ చల్లనిచూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సుఖసంతోషాలతో, పాడిపంటలతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం వర్ధిల్లాలని కోరారు. వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర దేవధాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తదితరులను ఆయన ఘనంగా సత్కరించి సన్మానించారు. స్వామివారి ఆశీస్సులతో అందరు బాగుండాలని కోరారు. కార్యక్రమంలో కూటమినాయకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రైతుల నుంచి లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : రైతులు నుంచి లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. ధాన్యం సేకరణపై అనుబంధశాఖల అధికారులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4,038 మంది రైతులు నుంచి 25,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. అకాల వర్షం హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులకు నష్టం జరగకుండా వెంటనే ధాన్యం సేకరించాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని 6 గోదాములలో నింపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 70 రైస్‌మిల్లులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం 30 రైస్‌మిల్లుల్లో ఫోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో వాటి నుంచి మాత్రమే సేకరిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జీఎం పి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఈబి విలియమ్స్, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, డిసివో శ్యామ్‌సన్, రైస్‌మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

తాతయ్య కుటుంబానికి నివేశన స్థలం

ఇండోచైనా యుద్దంలో గాయపడిన కేశన తాతయ్య కుటుంబానికి నివేశన స్థలం పట్టా సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళి అందజేశారు. 1962లో జరిగిన యుద్ధంలో నిజాంపట్నంకు చెందిన తాతయ్య రెండు కాళ్ళు కోల్పోయాడు. దీంతో సైనిక వెల్ఫేర్‌బోర్డు సిఫార్సు మేరకు తాతయ్య భార్య కేశన ఆలివేలమ్మకు బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల రెవెన్యూ పరిధిలో 6 సెంట్లు నివేశన స్థలం పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు ఉన్నారు.

విపత్తు నిర్వాహణ పర్యవేక్షణపై అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి) : విపత్తు నిర్వాహణ పర్యవేక్షణపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. విపత్తు నిర్వాహణ, పర్యవేక్షణ జిల్లా, డివిజన్,మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులందరికి శిక్షణా కార్యక్రమం సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు వర్చువల్ విధానంలో నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో విపత్తు నిర్వాహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. బాపట్లకు అకాల వర్షం, ఉరుములు, మెరుపులు, పిడుగులుపడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.జూన్ నుంచి డిసెంబర్ వరకు రెండుసార్లు తుఫాన్ వచ్చే అవకాశం ఉందన్నారు. పిడుగులు పడుతున్న సమాచారాన్ని 30నిమిషాలు ముందే ప్రజల మొబైల్ ఫోన్‌లకు సమాచారం ఇస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవటానికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన

కొల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు పంటసాగుదారుల హక్కు పత్రాలపై మండల వ్యవసాయాధికారి అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని చిలుమూరు, అనంతవరం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారు సొంత భూమి ఉన్నా లేకున్నా కౌలు ఒప్పందంతో భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు రెవెన్యూ శాఖ జారీ చేసే పంట సాగుదారు పత్రాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఏఏ, వీహెచ్‌ఏ, కౌలు రైతులు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంట బీమా నష్టపరిహారం, మార్కెటింగ్ వంటి పథకాలు లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా కౌలు రైతు కార్డులు తీసుకోవాలని నగరం మండలం తహసీల్దార్ బి.నాంచారయ్య అన్నా రు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కౌలు రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించి ప్రతి కౌలు రైతుకు ఈ కార్డు అందేలా చూడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి వి.రమేష్‌బాబు మాట్లాడుతూ కౌలు రైతులు తమ గ్రామ సచివాలయంలోని రెవెన్యూ అధికారులను సంప్రదించి, ఈ కౌలుదారు కార్డులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీఆర్‌వోలు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఫణి పాల్గొన్నారు.

ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాలలో...

చెరుకుపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాలలో కౌలు రైతు కార్డులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ కౌలురైతులందరూ తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, వాటి వలన ప్రభుత్వ పథకాలైన పంట నమోదు ఇన్‌ఫుట్ సబ్సిడీ వంటివి కౌలు రైతులకు కూడా వర్తిస్తాయని చెప్పారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్, వీఏఏలు, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.


వైభవంగా మొగదారమ్మతల్లి సిడిమానోత్సవం

రేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దైవచింతనతో ముందుకు వెళితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మొగదారమ్మతల్లి సిడిమానోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి హరనాథబాబు, ప్రసాదం వాసుదేవ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు

వీరాంజనేయ స్వామికి సిందూర లేపన పూజ



సిందూర లేపన పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

వేమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశ దీక్షతో సోమవారం వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. వెలగపూడి చంద్రమౌళి పద్మజా దంపతులు స్వామికి సింధూర లేపన పూజ జరిపించారు. సాయంత్రం హనుమాన్ మెడికల్ వారి ఆధ్వర్యంలో అష్టోత్తర సహస్రనామ పూజ జరిపారు. పల్లకి ఉత్సవంలో శ్రీవీరాంజనేయ కోలాట భజన సమాజం వారు కోలాట భజన ప్రదర్శించారు. వీరాంజనేయ భజన సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణ జరిపారు లక్ష్మీమెడికల్ అధినేత సనిశెట్టి సురేంద్ర దంపతులు, కొలిపాకుల నాగేంద్రం కుటుంబ సభ్యులు ప్రసాద వినియోగం చేశారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి : ఎంపీపీ

అమృతలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అమృతలూరు రామ్మోహన్‌నగర్ కాలనీలో నిర్మాణం చేసి నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకును ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను మండల పరిషత్ నుంచి కేటాయించడం జరుగుతుందన్నారు. అమృతలూరు, కూచిపూడి, మూల్పూరు గ్రామాల్లో సైడ్ డ్రెయిన్స్ నిర్మాణానికి మండల పరిషత్ నుంచి నిదులు కేటాయించనున్నట్లు చెప్పారు. పలు ప్రధాన కాల్వలు గుర్రపుడెక్క, తూటికాడతో నిండి ఉన్నాయని, వీటి తొలగింపునకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై నిరసన తెలిపారు. కొన్ని శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కూచిపూడి శ్రీనివాసరావు, దేవరకొండ సత్యవతి, ఈవోపీఆర్డీ మాకినేని రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నరేంద్రకుమార్

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



సమస్యలు సంబంధిత అధికారులకు తెలియజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 63 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సమస్యలపై అర్జీలు అందజేశారు. జిల్లాలోని అమర్తలూరు మండలం ఇంటూరుకి చెందిన దివ్యాంగురాలు పోతుపాలేపు నాగరాజ తన సమస్యను చెప్పుకోవటానికి రాగా ఎస్పీ బయటకొచ్చి ఆమె దగ్గరకు వెళ్ళి సమస్య అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారికి ఫోన్ చేసి ఆమె సమస్యను పరిష్కరించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు నిర్వహణ అభినందనీయం

● యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతారావు

కొల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థినీ, విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, ఆట, పాటలతో కూడిన సమ్మర్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శాంతారావు అన్నారు. మండల పరిధిలోని తోకలవానిపాలెంలో యూటీఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ టి.కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమ్మర్ క్యాంపులో ముందుగా యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు, ప్రజలకు నివాళులర్పించారు. అనంతరం శాంతారావు మాట్లాడుతూ, పిల్లలు, వినోదం, ఆట, పాటలు నేర్చుకోవాలన్నారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పిల్లలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం ఆట పాటలతో పాటు డ్రాయింగ్ నేర్పించడం సమ్మర్ క్యాంపులో జరుగుతుందన్నారు. సమ్మర్ క్యాంపు ఉపాధ్యాయులుగా సురేష్, సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. అంగన్‌వాడీ టీచర్ శారద, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, ఐద్వా నాయకురాలు దివ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు బదిలీ

కొల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతిపై ఈవోపీఆర్డీ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు సోమవారం బదిలీ అయ్యారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న పి.సునీత ప్రకాశం జిల్లా ముండ్లమూరు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా, కార్యాలయ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.వాణి ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పదోన్నతులు లభించడంతో ఇద్దరిని ఎంపీడీవో కె.నరసింహారావు విధుల నుంచి విడుదల చేసి అభినందనలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇరువురిని పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రేపల్లె, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలో ఏడుగురు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపారు. రాధాకృష్ణ లాడ్జిలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావటంతో సీఐ మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది లాడ్జిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.36,230 స్వాధీనం చేసుకుని వారిపై, లాడ్జి నిర్వాహకులపై కేసు నమోదు చేయటం జరిగిందని ఆయన చెప్పారు.

కొండవీడు అభివృద్ధిపై కినుక


కొండవీడుకోట ఏరియల్ వ్యూ

యడ్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం కలిగిన కొండవీడుకోట అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం పునరుద్ధరణ, ఇతర మౌలిక సదుపాయాలు మినహా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి ఆనవాళ్లు అగుపించడం లేదు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడును తీర్చిదిద్దుతామన్న నేతల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. గత బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొండవీడు కోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ మంత్రిని కోరారు. కేంద్రమంత్రి పెమ్మసాని, ఎంపీ లావుకు కేంద్రం నుంచి నిధులు కేటాయించేలా కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. నేటికీ ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

❑ గత టీడీపీ ప్రభుత్వంలో వేగంగా పురోగతి ❑ వైసీపీ హయాంలో ప్రచార ఆర్భాటమే.. ❑ కూటమి పాలనలో పరుగులందుకునేనా.. ❑ పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి ❑ అభివృద్ధి చేస్తే.. ప్రభుత్వానికి ఆదాయం.. ప్రజలకు వినోదం

కొండవీడు అభివృద్ధికి టీడీపీ కృషి

రెడ్డిరాజులు 14వ శతాబ్దం ప్రారంభంలో శత్రుదుర్భేద్యమైన కొండవీడుకోటను నిర్మించారు. కోట రక్షణ వ్యవస్థలో భాగంగా కొండల శిఖరాలపై 24 బురుజులు నిర్మించి, ఒకదానితో ఒకటి కలుపుతూ 20 కి.మీల మేర రాతిగోడను నిర్మించారు. వీటితోపాటు కోటలో అనేక దేవాలయాలు, మండపాలు, నీటి వసతి కోసం గొలుసుకట్టు చెరువులు, నేతి కొట్టు, బుంగబావి, నీటి బావులు, నాలుగు వైపులా ప్రవేశకోసం ముఖద్వారాలు నిర్మించారు. వీటిలో చాలా నిర్మాణాలు శిథిలావస్థకు చేరి కొన్ని రూపురేఖలు కోల్పోయి నామమాత్రంగా దర్శనమిస్తున్నాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేసింది. అప్పటి మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేశారు. పర్యాటకులు కొండవీడు కోటకు చేరుకునేందుకు వీలుగా ఘాట్ రోడ్డు నిర్మాణం, కోట వైపు నుంచి పురాతన మెట్లమార్గం, రాతి గోడ, ముఖ ద్వారాల పునరుద్ధరణ, శిథిలమైన దేవాలయాలు, మండపాల జీర్ణోద్ధరణ, కొండలపై ఉన్న వెదుళ్ల ముత్యాలమ్మ, పుట్టాలమ్మ చెరువులను అభివృద్ధి చేశారు. కోట గ్రామంలోని కత్తుల బావిగా పిలువబడే వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ చేసి, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు వంటి అంశాలతో సమగ్రమైన డీపీఆర్‌ను రూపొందించారు. మ్యూజియం, వేద పాఠశాల, రిసార్ట్స్, ఔషధ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పురావస్తు, అటవీ, ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖలను సమన్వయ పరుస్తూ కొండవీడు అభివృద్ధికి బాటలు వేశారు. ఐదేళ్ల సుమారు రూ.50కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టారు. తొలిదశ 5.1 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు, 1.5 కిలోమీటర్ల మెట్లమార్గం, కొండలపై ఉన్న మూడు చెరువుల అభివృద్ధి, నరసింహస్వామి దేవాలయం పునరుద్ధరణ పనులు 70శాతం మేర పూర్తి చేసింది. రెండో దశ 650 మీటర్ల ఘాట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు తెచ్చి సుమారు రూ.11 కోట్లతో టెండర్లను పిలిచి పనులను అప్పగించింది.


పునరుద్ధరించాల్సిన కోట గ్రామంలోని కత్తులబావి

వైసీపీ ప్రభుత్వ హయాంలో

వైసీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. టీడీపీ ప్రభుత్వం రూ.200 కోట్లతో రూపొందించిన సమగ్రమైన డీపీఆర్‌ను ప్రక్కన పెట్టి రూ.13.25 కోట్లతో ఐదేళ్ల కాలానికి కొత్త డీపీఆర్‌ను రూపొందించింది. అయితే వీటిలో టీడీపీ హాయాంలో 70 శాతం మేర పూర్తి చేసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, 650 మీటర్ల రెండో దశ ఘాట్‌రోడ్డు నిర్మాణం మినహా ఎలాంటి పునరుద్ధరణ పనులను చేపట్టలేదు. రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన శివాలయం పునరుద్ధరణ పనులు పునాదిలోనే నిలిచిపోయింది. మరుగుదొడ్లు నిర్వహణ లేక మూలన పడ్డాయి. గతంలో సీఎం చంద్రబాబు సమయంలో ప్రపంచస్థాయి రిసార్ట్స్ నిర్మాణానికి గొల్కొండ సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి ముందుకు వచ్చారు. వచ్చిన వైసీపీ ప్రభుత్వం నుంచి ఆయనకు సరైన సహకారం లభించలేదు.


కొండవీడుకోట ఘాట్ మార్గం

ఆరంభంలోనే నిలిచిపోయిన శివాలయం

శాఖల సమన్వయ లోపం

ఎంతో ఉన్నతంగా ఊహించుకుని కొండవీడు కోటకు వస్తున్న పర్యాటకులకు సంతృప్తి లభించడం లేదు. వాస్తవంలో వారు ఊహించిన వాతావరణం ఇక్కడ కనిపించడం లేదు. దీనికి పురావస్తు, అటవీ, దేవదాయ, ఆర్‌అండ్‌బీ, పర్యాటకశాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల అలసత్వం ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

భద్రతకు ప్రాధాన్యం

కొండవీడుకోట సమగ్ర అభివృద్ధితో పాటు ఇక్కడకు వచ్చే సందర్శకుల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఘాట్ మార్గంలో తరచూ కొండ చరియలు విరిగిపడుతున్నాయి. గతేడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు భారీగా కొండ చరియలు విరిగిపడి నెల రోజుల పాటు ఘాట్ మార్గాన్ని మూసివేశారు. కొండ చరియలు జారిపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

చేయాల్సిన అభివృద్ధి పనులు

- యువతను ఆకర్షించే విధంగా సాహస క్రీడలు హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, రాఫ్టింగ్, బోటింగ్, ఏటీవీ వెహికల్ రైడింగ్, ఆర్చరీ వంటి వాటిని నిర్వహించాలి.
- కొండలపై చుట్టొచ్చే విధంగా రోప్‌వే నిర్మాణం చేయడం, చెరువుల్లో 365 రోజులూ నీటి స్థిరీకరణ చేయాలి.
- రెడ్డిరాజులు వసంత రుతువులో విదేశాల నుంచి ఖరీదైన సుగంధ ద్రవ్యాలను తెప్పించి వైభవంగా వసంతోత్సవం నిర్వహించేవారని, కర్పూర ఖండాలను ప్రజలపై చల్లేవారని ఖ్యాతి. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని ఏటా వసంతోత్సవం, వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యాన్ని తీసుకురావచ్చు.
- ప్రతిపాదన దశలో నిలిచిపోయిన ఎకో పార్కును పట్టాలెక్కించాలి. ఔషధ మొక్కలు విరివిగా ఉన్న ఈ ప్రాంతం మెడికల్ టూరిజంకు అవకాశాన్ని కల్పిస్తుంది. తరచూ కవితా గోష్ఠులను ఇక్కడ నిర్వహించడం వంటివి చేయాలి.
- ప్రణాళిక ప్రకారం వీటిని చేపట్టి నిర్వహిస్తే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక కేంద్రంగా విలసిల్లే అవకాశం ఉంది.



వైసీపీ హయాంలో.. మరింత దారుణం

గత వైసీపీ హయాంలో తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు ప్రాంగణంలో అభివృద్ధి పనులకు ముందుకు రాలేదు. పైగా ఏళ్ల తరబడి ఉన్న వివిధ వృక్షాలను నరికి, వాటి దుంగలను తరలించుకున్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెనాలిలో రైతు భరోసా సభను పెట్టుకునేందుకు యార్డు ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఆ సమయంలో యార్డు గోడను సైతం పగులగొట్టి.. కార్లు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తిరిగి గోడను నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించకపోగా ఉన్న వాటిని కూడా ఈ విధంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ముఖ్యంగా అందరినీ ఆకర్షించేలా ఎడ్లబండితో రైతు పంటలను తీసుకువస్తున్న విగ్రహాలను యార్డు బయట ఏర్పాటు చేశారు. దీనిని చూసిన రైతులు లోపల సేవలు లేవు.. బయట ఆర్భాటం ఏంటో అంటూ నిష్ఠూర పోయారు.

ఎట్టకేలకు.. యార్డు అభివృద్ధికి మోక్షం..!

▼ దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం
▼ మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన
▼ తెనాలి యార్డులో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు, మరుగుదొడ్లు ▼ వైసీపీ హయాంలో జగన్ సభకు చెట్లు, గోడల కూల్చివేత

తెనాలి రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు, ధాన్యం నిల్వచేసేందుకు తెనాలిలో ఏర్పాటు చేసిన వ్యవసాయమార్కెట్ యార్డులో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో యార్డు అభివృద్ధి కుంటుపడింది. రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. నిమ్మ, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ యార్డు పెట్టింది పేరు. తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు ప్రాంతాల నుండి రైతులు నిమ్మకాయలను యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతుంటారు. ఇక్కడి వివిధ రాష్ట్రాలకు ఎగుమతులవుతాయి. నిత్యం వందలాది మంది రైతులు వచ్చిపోయే మార్కెట్ యార్డు ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. దీంతో బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించక తప్పట్లేదు. కూటమి ప్రభుత్వం కొలుదీరిన అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా సిమెంట్ రోడ్లు, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ1.40 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అవి నిర్మాణ దశలో ఉన్నాయి. అన్న క్యాంటిన్‌ను యార్డు ప్రాంగణంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేవారు సైతం వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు.


యార్డులో నూతనంగా సిమెంట్‌రోడ్లకు జరుగుతున్న పనులు


యార్డులో రైతులకు కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు

ఇంకా చేయాల్సింది కొండంత..

తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధిపనులు మరిన్ని చేయాల్సి ఉంది. ఏళ్లనాడు కట్టిన గోడౌన్‌ల నిర్వహణలో లోపాలు అనేకమున్నాయి. గోడలకు రంగులు పోవడంతో పాటు పైకప్పులు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. ఇక షెట్టర్లకు సకాలంలో గ్రీజు వంటివి పెట్టకపోవడం, ఏళ్ల నాటివి కావడంతో అవికూడా మార్చాల్సి ఉంది. గోడౌన్లకు ఉన్న కిటికీలు కూడా దెబ్బతిన్నాయి. భద్రపరిచిన ధాన్యాన్ని ఎలుకలు పాడుచేసే అవకాశం ఉంది. యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. వీటిపై కూడా ప్రభుత్వం దృష్టిపెడితే రైతాంగానికి ఎంతో మేలు కలుగుతుంది.

ఉన్నతాధికారులకు నివేదిక

యార్డు కార్యదర్శి సుబ్బారావు



కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక యార్డుల్లో సమస్యలపై నివేదిక కోరింది. దీంతో సమస్యలను ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. త్వరలోనే పూర్తిస్థాయిలో యార్డును తీర్చిదిద్దుతామని తెనాలి యార్డు కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

ఉపాధి శ్రామికులకు బీమా భరోసా..!

● సహజ, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల పరిహారం ● అంగీకార పత్రం అందిస్తే.. ప్రభుత్వమే నగదు చెల్లింపు ● పని ప్రదేశంలో భద్రతకు ప్రభుత్వాలు కృషి


ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

నకరికల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో కూటమి ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధి కల్పించడమే గాక, ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు శ్రామికులు చనిపోతే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి శ్రామికుల జీవితాలకు భద్రత కల్పించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్ ఈ మేరకు జీవో విడుదల చేశారు. దీంతో రూ.50 వేలుగా ఉన్న పరిహారం.. రూ.2 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రధాన మంత్రి సురక్షా బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తుంది. వేతనంలో రూ.20లు చెల్లించమనే అంగీకార పత్రాన్ని ఉపాధి హామీ కార్యాలయంలో అందివ్వాలి. దీంతో శ్రామికుని పేరుతో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ద్వారా ప్రభుత్వమే బీమా నగదు రూ.20 చెల్లిస్తుంది. ఈ ప్రమాద బీమా 70 ఏళ్ల వయస్సు వరకు వర్తిస్తుంది.

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తు మరణించినా.. రూ.2 లక్షలు బీమా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.430లు తనకు వచ్చే వేతనం నుంచి చెల్లించమని అంగీకార పత్రం శ్రామికులు ఉపాధి కార్యాలయంలో అందించాలి.

ఆర్థిక స్థితి కలిగిన వారు మాత్రమే పొందగలిగే బీమా పథకాలను ఉపాధి శ్రామికులకు ప్రభుత్వం కల్పిస్తోంది. దీంతో ఉపాధి శ్రామికులందరికీ బీమా రక్షణ కల్పిస్తోంది.

ఉపాధి కుటుంబాలకు బీమా రక్షణ

పల్నాడు జిల్లాలో 3.42 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. 5.88 లక్షల మంది ఉపాధి శ్రామికులు ఉన్నారు. రూ.20తో ప్రమాద బీమా, రూ.436తో సాధారణ, ప్రమాద బీమాలు ఉపాధి శ్రామికులకు అందుబాటులో ఉన్నాయి.



-సిద్ధ లింగమూర్తి, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పల్నాడు











మండుటెండకు.. ముఖం చాటేస్తూ..!

భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తిపోయారు. సోమవారం 44 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ ప్రభావం చూపెంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఉదయం 10 గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తలకు తువ్వాలు, చేతి రుమాలు, చున్నీ రక్షణ కవచంలా ధరించారు. వాహనాలపై వెళ్లేవారు వేడి సెగ తాకకుండా ముఖాలను పూర్తిగా కప్పేసుకున్నారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మే12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. అద్దంకి పట్టణంలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవికుమార్‌ను ఆయా ప్రాంతాలలో స్థానికులు వినతిపత్రాలు అందజేసి సమస్యలను వివరించారు. పలు సమస్యలపై తరచూ అర్జీలు వస్తున్నందున వెంటనే అర్జీదారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మురుగునీటి సమస్య, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సైడ్ డ్రైన్ ల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్య లను మంత్రి రవికుమార్ దృష్టి కి తీసుకు పోయారు. అద్దంకి పట్టణంలోని మొండితోకపాలెం లో వాగుపోరంబోకు భూమిని స్థానికులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడంతో మురుగునీరు, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని పెనుబాక ఆదాం మంత్రి రవికుమార్‌కు అర్జీ అందజేశారు. శ్రీనగర్ లో వర్ధిక ఆర్థో, స్కిన్ అండ్ ట్రామా కేర్ హాస్పటల్ ను మంత్రి రవికుమార్ ప్రారంభించారు.

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

వాసవినగర్‌లో టీడీపీ ఆర్యవైశ్య నాయకుడు, భాస్కర్ సప్లయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు మాతృమూర్తి మహాలక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం మంత్రి రవికుమార్ పరామర్శించారు. మహాలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బంగ్లా రోడ్డులో రవీంద్ర భారతీ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ తోట చినమద్దులేటి ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు కరి పరమేష్, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి, కొమ్మాలపాటి సుధీర్, సందిరెడ్డి రమేష్, చిన్ని మురళీసుధాకర్, కరారి నాగేశ్వరరావు, మానం మురళీమోహన్‌దాస్, ఉన్నారు.

మేదరమెట్లలో : మండలంలోని కుర్రవానిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వజ్జా సీతారామయ్య కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. సోమవారం కుర్రవానిపాలెంలోని తెలుగుదేశం నాయకులు వజ్జా వాసు, సోదరుడైన సీతారామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు. అనంతరం నాదెండ్ల వెంకటరత్నం ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు కోట శ్రీనివాసరావు, నాదెండ్ల లక్ష్మయ్య, కారసాల గురుబాబు తదితరులున్నారు.

సుబ్బారావుకు మంత్రి గొట్టిపాటి పరామర్శ



మానం సుబ్బారావును పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు : టీడీపీ సీనియర్ నాయకులు, రామకూరు గ్రామమాజీ సర్పంచ్ మానం సుబ్బారావును రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మానం సుబ్బారావును సోమవారం ఆయన నివాసంలో కలిసిన మంత్రి గొట్టిపాటి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడేవరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మంత్రి రవికుమార్ టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పార్టీ నాయకులు కేవీ. సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, నార్నె సుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, మస్తాన్‌వలి, బోరెడ్డి ఓబులరెడ్డి, గరిమిడి జగన్‌మోహన్, గుడిపాటి సుబ్బారెడ్డి, కాటా అంజయ్య, భానుప్రకాష్, హరిబాబు పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు జీవధ్వజ ఊరేగింపు

- శింగరకొండలో మహాకుంభాభిషేకానికి విశేషంగా ఏర్పాట్లు
- పలు ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలు

అద్దంకి, జూన్12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో నగరోత్సవము నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం లో ప్రారంభమై కాకానిపాలెం, పాతబస్టాండ్ సెంటర్, పాత గాంధీబొమ్మసెంటర్, భవానిసెంటర్ మీదుగా శింగరకొండకు జీవధ్వజస్తంభం ఊరేగింపు సాగనుంది. గతంలో జీవధ్వజస్తంభం ఇచ్చిన దాత మేదరమెట్ల శంకరారెడ్డి ప్రస్తుతం కూడా పునఃప్రతిష్ఠకు దాతగా ఉన్నారు. 35 అడుగుల ఎత్తు ఉన్న ధ్వజస్తంభం తయారీని మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, యేజెండ్ల ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

19న గుండ్లకమ్మ నది నుంచి కలశయాత్ర

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న మహాకుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో ఉదయం 5 గంటలకు అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మనది నుండి శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు కలశయాత్ర నిర్వహించనునన్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. యాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.

రాతి మండపం నిర్మాణానికి విరాళాలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం నిర్మాణం కోసం సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన మాజీ పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, భారతి దంపతులు సందిరెడ్డి హనుమంతరావు, మల్లెంపూడి లక్ష్మయ్యల జ్ఞాపకార్థం రూ.1,00,116లను అందజేశారు. అద్దంకికి చెందిన నేరెళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం అలంకారలక్ష్మి, కుమారులు వెంకటశేషగిరి, శ్రీనివాసరావు, కుమార్తెలు చుండూరి వెంకటసుజాత, బాడకట్టు శశికళలు రూ.1,01,116 సోమవారం ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు. కాకానిపాలేనికి చెందిన అద్దంకి మున్సిపల్ వైస్‌చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి బాలవీరయ్య దంపతులు మారుతీ భవన్ లో గది అభివృద్ధికి అవసరమైన ఏసీ, డబుల్‌కాట్ మంచం, బెడ్, గీజర్ తదితర వస్తువుల కొనుగోలుకు అవసరమైన నగదు అందజేశారు. చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సాగర హారతి

వాడరేవు (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సామూహిక సాగర హారతి నిర్వహించారు. ఈక్రమంలో భక్తులు విశేషంగా పూజల్లో పాల్గొన్నారు. వైభవంగా కోదండరామస్వామి కల్యాణం

కోదండరాముని కల్యాణం

మార్టూరు : మండలంలోని రాజుపాలెం కోదండరామాలయంలో సోమవారం కోదండరామస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామస్థులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు స్వామి వారికి నూతన వస్త్రాలను అందజేశారు. కొబ్బరి కాయలు కొట్టి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా స్వామి వారి కల్యాణం అక్షితలను భక్తిపూర్వకంగా కళ్లకు అద్దుకొని, స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఇక సాయంత్రం గ్రామంలో కోదండరాముని ఉత్సవ విగ్రహాలను ఎడ్లబండిపై ప్రత్యేకంగా అలంకరించి యువకులు, భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు కూడా ఈ గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక తిరుకల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

నూతన రథోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

పేరాల (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని పేరాల్లో వేంచేసిన శ్రీగంగా భ్రమరాంబ సమేత పునుగు శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన రథోత్సవం సోమవారం రథంకమిటి ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ఈక్రమంలో వారికి కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామి వారి ఉత్సవం గతంలో 1971 లో జరిగింది. తిరిగి 54 సంవత్సరముల తరువాత నూతన పెద్ద రథం పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్మించి ఉత్సవం జరపడంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

చెరుకూరు (పర్చూరు): పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామివార్ల దేవాలయంలో వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌక ర్యం లేకుండా ఆలయ కార్య నిర్వాహక కార్యదిర్శి ఎం.నాగయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివార్ల కళ్యాణ వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

మంత్రికి సోపిరాల గ్రామపెద్దల సన్మానం

చినగంజాం, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామానికి వచ్చిన దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాణరెడ్డిని సోపిరాల గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. బాపట్ల, చీరాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొని నెల్లూరు తిరిగి వెళ్తూ మార్గమధ్యంలో సోమవారం రాత్రి ఆయన సోపిరాల గ్రామాన్ని సందర్శించారు. సోపిరాల గ్రామానికి చెందిన విజయరావు మధుసూదనరావు మంత్రి రామనారాయణరెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మధుసూదనరావు ఇంటిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రిని గ్రామస్థులు సన్మానించారు.



శింగరకొండ లో ప్రతిష్ఠించనున్న జీవధ్వజస్తంభం



చీరాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారయణరెడ్డి









చీరాలలో సాగరహారతి, నేరెళ్ల వెంకట శేషగిరి, శ్రీనివాసరావులకు రసీదులు అందజేస్తున్న ఈఓ తిమ్మానాయుడు, పర్చూరులో స్వామివారి అలంకరణ, రాజుపాలెంలో కోదండరాముని కళ్యాణోత్సవం

అతిథి అధ్యాపకులకు ప్రభుత్వం శుభవార్త

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులు(గెస్ట్ టీచర్లు)గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారికి ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాన్ని రెండు రెట్లు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అతిథి అధ్యాపకులకు ప్రస్తుతం గంటకు రూ. 150 చెల్లిస్తుండగా దానిని రూ. 375కు పెంచారు. అయితే ఈ పెంపుదల గరిష్ఠంగా రూ. 27వేలకు మించరాదు. ఈ ఉత్తర్వులపై తగు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్యా డైరెక్టర్‌ను పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఆదేశించారు. గౌరవ వేతనం పెంపు పట్ల అతిథి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు మే నెల జీతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు 2024 మే నెల జీతం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు ఫైల్‌ఆర్థిక శాఖకు చేరింది. ఈ జీతం చెల్లింపునకు సంబంధించి ప్రతిపాదనలు పంపి సహకరించిన ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతి శుక్లాను జేఏసీ నాయకులు సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కార్యదర్శి చక్రమల్లి నాయక్, మహిళా ప్రతినిధులు రాజ్యలక్ష్మి, విజయకుమారి, సింధు తదితరులు ఉన్నారు.

మొక్కుబడి మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ రోడ్డు అంచునే తవ్వి బరమ్‌లకు పోయటంతో కుంగే అవకాశం

మంత్రి రవికుమార్‌కు గోవాడ గ్రామస్థుల ఫిర్యాదు

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి రవికుమార్

అద్దంకి, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగరకొండపాలెం-అంబడిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సుమారు 70 లక్షల రూపాయలతో చేస్తున్న మరమ్మతులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రోడ్డు మార్జిన్ వెడల్పుగా ఉండగా ప్రస్తుతం మరమ్మతుల పేరుతో బరమ్‌లకు మంచి గ్రావెల్ తోలాల్సిన కాంట్రాక్టర్ రోడ్డు అంచునే ఎక్స్‌కవేటర్‌తో తవ్వి పోస్తున్నారు. దీంతో మార్జిన్ పూర్తిగా తగ్గిపోగా ఇప్పటి వరకు పటిష్ఠంగా ఉన్న బరమ్ కాస్తా తవ్వటంతో పటిష్ఠత కోల్పోయింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుకు రెండు వైపులా తవ్వి పోసిన గ్రావెల్ మొత్తం జారిపోవటం ఖాయం అని గోవాడ గ్రామస్థులు ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. వెంటనే రవికుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణలో మాత్రమే రోడ్ల మరమ్మతులు చేయాలని, కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యానికి వదిలివేయరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

ఇక శింగరకొండపాలెం నుంచి బొమ్మనంపాడు మీదుగా ముప్పవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు కొన్ని చోట్ల తరచూ కుంగి ఇంకొన్నిచోట్ల ఉబ్బులు వస్తున్నాయి. ఇటీవల మరమ్మతుల సమయంలో కూడా ఆయా ప్రాంతాలలో లూజు మట్టి తొలగించి తారు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉన్నా అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేయటంతో మళ్లీ యథాస్థితికి చేరింది. వేగంగా వచ్చే వాహనాలు అసలే మలుపు కావటం అక్కడే రోడ్డు కుంగి ఉబ్బు రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కాంట్రాక్టర్‌లు ఇష్టానుసారం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా పర్యవేక్షణ లేకుండా చేస్తుండటంతో ఆశించిన ప్రయోజనం రాకపోగా ప్రమాదాలకు నిలయంగా మారాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు జరిగే సమయంలో ఖచ్చితంగా పర్యవేక్షణ చేయాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు అంచునే తవ్వి మార్జిన్‌లో పోసిన మట్టి



బొమ్మనంపాడు సమీపంలో కుంగిన రోడ్డు

అవీ..ఇవీ..

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, మే 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా సోమవారం లక్ష తమలపాకుల పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకము, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి 11 ఆవృత్తములుగా వేద పండితులు, పూజారులు లక్ష తమలపాకుల పూజ చేశారు. ఉభయదాతలుగా గుంటూరు న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

కనులపండువగా రామకోటేశ్వరస్వామి కల్యాణం

చినగంజాం, మే 12(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో లలితా పరమేశ్వరి అమ్మవారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంతరావు స్వామి వారికి అభిషేకాలు చేశారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విశేషంగా అలంకరించిన స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి మేళతాళాలు, మహిళల కోలాటప్రదర్శనలతో సోపిరాల గ్రామంలోని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

బల్లికురవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత వల్లాయపాలెం గ్రామంలో సోమవారం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా దేవాలయంలో ఉన్న వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాల వద్ద యాత్రిక స్వామి వినుకొండ నరసింహాచార్యులు, ఆలయ అర్చకులు వినుకొండ విక్రమ్లు పర్యవేక్షణలో కళ్యాణాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పంగ వాతావరణం నెలకొంది. కళ్యాణం అనంతరం గ్రామస్థులు సమిష్టి కృషితో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు



ప్రధాన ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు

అలరించిన మహిళల కోలాట ప్రదర్శన, తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు

పంగులూరు, మే 12(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి వారి 21వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయంలో శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం (అద్దంకి) చెందిన మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. స్వామివారి తిరునాళ్ల సందర్భంగా ఉత్సవ కమిటీ, గ్రామ టీడీపీ, తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్షవర్ధన్‌కు ఈవో శ్రీనివాసరావు, పార్టీ నేతలు, తెలుగు యువత ఘనస్వాగతం పలికింది. ఆలయ ప్రాంగణం, పరిసరాలు విద్యుత్ దీపకాంతులతో శోభను సంతరించుకోగా, తిరునాళ్ల మహోత్సవం తిలకించేందుకు పంగులూరు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకుంది. పూజా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు త్రివేణిబాబు, పార్టీ నాయకులు చౌదరి బాబు, శ్రీకాంత్, జగన్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మంత్రి తనయుడు హర్షవర్ధన్

కనులపండువగా ఆంజనేయస్వామి కల్యాణం

పావులూరు తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

పావులూరు(ఇంకొల్లు),మే 12, (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న పొలిమేర వీరాంజనేయస్వామి 71వ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం ఎండతీవ్రతను సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం సువర్చల సమేత వీరాంజనేయస్వామి వారి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కనుల విందుగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చొని స్వామి కల్యాణం జరిపించారు. ఈ 71వ కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరునాళ్లను ఏర్పాటు చేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారి వద్దకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అన్నదాన సత్రాలలో అన్నదానం నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి వరకు భక్తుల రద్దీ తగ్గలేదు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకున్నారు.



అలంకరణలో ఆంజనేయస్వామి

అవీ..ఇవీ..

ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో కడవకుదురు డ్రైవర్ల సత్తా


కడవకుదురులో నిర్వహిస్తున్న ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే.12(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కడవకుదురు గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీలలో పాల్గొనేందుకు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన కొత్తపట్నం, ఒంగోలు, పర్చూరు, ఇంకొల్లు, చింతగుంపల్లె, పెదగంజాం తదితర ప్రాంతాలకు చెందిన 24 మంది డ్రైవర్లు వచ్చినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలలో కడవకుదురు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి(షేక్.షరీఫ్‌డ్రైవర్) నిర్ణీత ఒక నిమిషం వ్యవధిలో 252 అడుగుల దూరం నడిపి మొదటి బహుమతి రూ.5,116లను కైవసం చేసుకున్నాడు. కడవకుదురుకు చెందిన గాజుల జగదీష్ 178 అడుగుల దూరం నడిపి రెండ బహుమతి రూ.3,116లను, కడవకుదురుకు చెందిన కేశన బాజీ 152 అడుగుల దూరం నడిపి మూడవ బహుమతి రూ.2,116లు అందుకున్నారు. న్యాయ నిర్ణీత, యాంకర్‌గా తంగెడ హసాన్ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వ హణ కమిటీ సభ్యులు పేరాబత్తుల రామకృష్ణ, తోటకూర సుబ్బారావు, బత్తిన శ్రీనివాసరావు, గుద్దేటి వెంకటేశ్వర్లు, తోటకూర వీరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న న్యాయాధికారి

అద్దంకి, మే12 (ఆంధ్ర జ్యోతి): వేసవి తాపం నుంచి దాహార్తిని తీర్చేందుకు అద్దంకి పట్టణానికి చెందిన విశ్రాంత న్యాయాధికారి, కొత్త మాసు రంగ నాయకులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మాసు మురళీకృష్ణ అచ్యుతరావు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయం పక్క రోడ్డులో తన ఇంటి ముందు ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో సుమారు 200 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గత 15 రోజులుగా పంపిణీ చేస్తున్నారు. ఎండల తీవ్రత తగ్గే వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రుచికరమైన మజ్జిగ పంపిణీ చేస్తుండటంతో అటు వైపు వెళ్లే ప్రతి ఒక్కరు తమ వాహనాలను ఆపి మజ్జిగ తాగి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.




ముందుకు కదలక ఇళ్ల వద్దే నిలిచిన మురుగు, పర్చూరు - చీరాల రోడ్డులో డ్రైనేజ్ కాలువపై నిర్మాణం




బొమ్మలకూడలిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు, కాలువలోనికి వెళ్లి మురుగుతొలగిస్తున్న కార్మికుడు

కొందరిపాపం మరికొందరికి శాపం

- డ్రైనేజ్ కాలువలపై వ్యాపార కట్టడాలు
- మురుగు ముందుకు కదలని వైనం

పర్చూరు, మే12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం పర్చూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైంది. ఉన్న కాలువలపై అక్రమనిర్మాణాలు చేపడుతుండడంతో కాలువల్లో మురుగుముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కాలువల్లో పడేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుతున్నాయి. దీంతో వర్షాల సమయంలో నీరు కాలువపై నుంచి బయటకు పొర్లుతున్నాయి. కొందరి ఆక్రమణల పాపం మరి కొందరి పరిశుధ్యకార్మికులకు శాపంగా మారుతోంది.

నిత్యం పారిశుధ్య కార్మికులు కాలువలను శుభ్రం చేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన నెలకొంది. దీనికి తోడు వ్యాపారులు తమ దుకాణాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా డ్రైనేజ్ కాలువల్లోకి పారవేయటంతో సమస్యత తీవ్రతరంగా మారింది. మురుగుతోపాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. పరూరు - చీరాల, పర్చూరు - ఇంకొల్లు, గుంటూరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రైనేజ్ కాలువల పరిస్థితి మరింత దయనీయం. ఈరోడ్లలో ఎక్కడ చూసిన డ్రైనేజ్ కాలువలపై భారీ కట్టడాలే దర్శనమిస్తున్నాయి అంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

పారిశుధ్య కార్మికులకు అవస్థలే

కొద్దిపాటి వర్షం కురిసినా పారిశుధ్య కార్మికులకు అవస్థలు అన్నవిధంగా పరిస్థితి తయారైంది. అక్రమణ దారులు ఏర్పాటు చేసుకున్న కట్టడాల క్రింద ఉన్న కాలువల్లోని వెళ్ళి మరీ పారిశుధ్య పనులను చేయాల్సి వస్తుంది అంటే సమస్య ఎంత తీవ్రతరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజ్ కాలువలపై కట్టడాలను తొలగించి మురుగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏల్చూరుకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


అద్దంకిలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే12 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో పరిశ్రమలు, వ్యవసాయం, గృహవినియోగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏల్చూరు వద్ద రూ.23 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు, రైతుల వద్ద నుంచి 11.68 ఎకరాల భూమి కూడా సేకరించినట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలో సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వివరించారు. నియోజకవర్గానికి 4 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, ఇప్పటికే అద్దంకి పట్టణంలో రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన జరిగి పనులు ప్రారంభమయ్యాయన్నారు. సంతమాగులూరు మండలం కొప్పరం, బల్లికురవ మండలం మల్లాయపాలెంల వద్ద 33/11 కెవి సబ్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయననున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో 1300 పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మరో 600 కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. అద్దంకి పట్టణంలో కాలువ కట్టను మినీ బైపాస్ రోడ్డుగా మార్చేందుకు ఇప్పటికే రూ.15 కోట్లతో టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. మలివిడతలో కాకాని పాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ వరకు మినీ బైపాస్ రోడ్డు పొడిగించనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు అదనపు సిబ్బందిని కేటాయించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తో ఫోన్‌లో మంత్రి రవికుమార్ మాట్లాడారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఓపెన్ జిమ్ స్థానంలో ఇండోర్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర ను ఆదేశించారు. విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ దామోదరం, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు

పరిశ్రమలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక లైన్‌ను ప్రారంభించిన ఈఈ మస్తాన్‌రావు


లైను ప్రారంభిస్తున్న ఈఈ

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పేర్కొన్నారు. బల్లికురవ సబ్‌స్టేషన్ నుంచి వీర్ల గంగమ్మ వైపు ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు కొంతకాలంగా లోవోల్టేజ్ విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. దీంతో పరిశ్రమల యజమానులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకు పోయారు. మంత్రి ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ నుంచి గంగమ్మ దేవాలయం వరకు రూ.30 లక్షల ఖర్చు చేసి ప్రత్యేక విద్యుత్‌లైనును ఏర్పాటు చేశారు. ఈ లైన్‌ను సోమవారం ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, అద్దంకి నియెజక వర్గంలో ఆర్‌టీఎస్ఎస్ ద్వారా నూతన స్తంభాలను లైన్లను ఏర్పాటు చేయిస్తున్నామ న్నారు. ప్రజలకు, మరియు పరిశ్రమల వారికి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను అందిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చిన 10 నెలల సమయంలో పెద్ద ఎత్తున విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా నూతన లైన్ ఏర్పాటు చేసి ప్రారంభించడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టురు ఏడీఈఈ సురేంద్ర బాబు, ఏఈ శ్రీనివాసరావు, లైన్‌మేన్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

అవగాహన సదస్సులో ఏడీఏ మోహనరావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ

ఇంకొల్లు, మే 12, (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు పండించినట్లయితే లాభాలు పొందవచ్చునని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. మండలంలోని ఇడుపులపాడులో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మగ్గు చూపాలన్నారు. ఈ పద్ధతిలో పండించిన ఆహారం తినడం వలన ఆరోగ్యంతో పాటు లాభాలు పొందవచ్చునన్నారు. భావితరాలకు మంచి వ్యవసాయభూమిని అందజేయాలన్నారు. రసాయన ఎరువులతో వచ్చే అనర్థాలను వివరించారు. మహిళలు పెరటి తోటలు ప్రకృతి వ్యవసాయ విధానంతో చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంద న్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కె టింగ్ ధ్రువీకరణపత్రం అందజేస్తారని ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టిన సుబ్బారావు, జక్రయ్య, సులోచన, శ్రీకాంత్, రాంబాబు, అంజయ్య, శ్రీనివాసరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్,సర్పంచ్ బండారు సుమతి, రైతులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సాధించిన విజయం


మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

వాడరేవు (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మాదిగ సామాజిక వర్గంతో పాటు ఎంతోమంది ప్రముఖులు, అవగాహనపరులు పూర్తిస్థాయిలో మంద కృష్ణమాదిగకు మద్దతు తెలిపారని ఇది సమైఖ్య విజయమని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వాడరేవులో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుకు వీర మరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నరసయ్య మాదిగ, వందనం, రమేష్, తేళ్ల రమేష్, నాగేశ్వరరావు, రవి, అంకయ్య, విజయ్‌సుందర్, వీర శేఖర్, అభిషేక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈగా శ్రీనివాసరావు బాధ్యతలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈ

పర్చూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు సబ్‌డివిజన్ విద్యుత్ కార్యాలయ డీఈఈగా జె.శ్రీనివా సులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేటపాలెం డీఈఈగా విధులు నిర్వహిస్తూ పర్చూరు వచ్చారు. ఇప్పటి వరకు పర్చూరు కార్యాలయంలో విధులు నిర్వహి స్తున్న రమేష్ గుంటూరు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఈని స్థానిక ఏఈ రమేష్ నాయక్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి నిధుల మంజూరుకు వినతి

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలో జీర్ణావస్థలో ఉన్న రామాలయం పునర్మిణానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాలని బల్లికురవ గ్రామ ప్రజలు సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అయన సవ్గృహంలో కలిసి విన్నవించారు. ఈసందర్భంగా వారు దేవదాయ శాఖ పరిధిలో రామాలయం ఉందని నిధులు మంజూరు చేయిస్తే నూతన దేవాలయం నిర్మాణం చేపడతామని తెలపగా మంత్రి గ్రామ ప్రజలు మ్యాచింగ్ నిధులు రూ. 40 లక్షల పైబడి చెల్లిస్తే కొంత దేవాదాయ శాఖ ద్వారా మంజూరు చేయిస్తామని వారికి హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యోగాతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత


బహుమతులతో విద్యార్థులు

చినగంజాం, మే 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొం దుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగాశిక్షకులు వై.రామాంజనేయులు అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ అధికారి శ్రీరామచంద్రమూర్తి వేదిక్ టేబుల్స్‌లో 20 లోపు మల్టీఫిక్ లేషన్ చేసి షార్ట్‌కట్ అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం బోధించిన అంశాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అంద జేశారు. కంప్యూటర్ల వర్డ్ ప్యాడ్ ఎలా ఉపయోగించాలి, పలు అంశాలపై విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఆర్.పోతు రాజు, పి.శ్రీనివాసరావు, గ్రంథపాలకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తా

- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య


ఆర్‌వో ప్లాంటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

గవినివారిపాలెం (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గవినివారి పాలెంలో నాంది స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నట్లు గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. ఈనేపధ్యంలో ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని పలుమార్లుచర్చలు జరిపి ఆర్వో ప్లాంటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈక్రమంలో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఎఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నక్కల వెంకటేశ్వర్లు తదితర టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా దంపతులకు గాయాలు

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై గుంటూరు వైపు మండల పరిదిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద కందుకూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు దేవా,సుస్మితలకు గాయాలయ్యాయి. వారిద్దరిని హైవే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గాయపడిన భార్యా భర్తలు కందుకూరుకు చెందినవారు. వారు వ్యక్తిగత పనులు నిమిత్తం చిలకలూరిపేట వెళుతుండగా ప్రమాదం జరిగింది.

గృహనిర్మాణాలను పూర్తిచేయండి


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఈ ఖాదర్‌వలి

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై డబ్బులు చాలక ఇళ్లనిర్మాణాలను పూర్తి చేసుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి అన్నారు. ఆయన సోమవారం మార్టూరులో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లనిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూ రైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోలేని వారికి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు మంజూరుచేసిందన్నారు. దీంతో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను పూర్తిచేసుకోవాలన్నారు. అనంతరం ఆయన మార్టూరు హౌసింగ్ కార్యాలయంలో మండలంలో వివిధ స్టేజీలలో పెండింగ్ లో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి నిర్మాణాలను పూర్తిచేసేవిధంగా లబ్దిదారులకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం మార్టూరు హౌసింగ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌ను అభినందించారు. పక్కా ఇళ్లు మంజూరైన లబ్దిదారులకు సక్రమంగా సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ అవ్వారు హరిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు


గాయపడ్డ కాలేషావలి

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు షేక్ కాలేషావలి సోమవారం మూడు చక్రాల బైకు అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అందిన సమాచారం మేరకు మార్టూరు నుండి మూడు చక్రాల బైకుపై వస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ కాలేషావలి గోతుల వద్దకు వచ్చే సరికి బైకు పడి పోయింది. వెంటనే బల్లికురవ 108 సిబ్బంది గాయాల పాలయిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను మార్టూరు వైద్యశాలకు తరలించారు.